విశాలాంధ్ర
విజయనగరం
పేజి నెం. 8
శనివారం 23, మార్చి, 2024

చెరకు తోట దగ్ధం

విశాలాంధ్ర-బాడంగి: బాడంగి మండలం జి.కె.ఆర్.పురం గ్రామానికి చెందిన పలువురు రైతుల చెరకు తోట శుక్రవారం దగ్ధం అయిందని అగ్ని మాపక అధికారి రామినాయుడు తెలిపారు. ఈ ప్రమాదంలో పూడి శంకర్ రావు, గంగరాజు, మారాడన లక్ష్మణ్, అల్లు సత్యనారాయణ, మూడేండ్ల కృష్ణ, రాము, పైడిపు నాయుడు, అప్పలు నాయుడు, బొంగులా అప్పల నాయుడు, గంట సత్యనారాయణ లకు చెందిన చెరకు తోట దగ్ధం అయిందన్నారు. సుమారు 5లక్షల రూపాయలు విలువ గల ఆస్తి అగ్నికి ఆహుతి అయిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి అగ్ని అదుపులోకి తీసుకువచ్చామన్నారు.

ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక

విశాలాంధ్ర-నెల్లిమర్ల/భోగాపురం: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక కోరారు. సున్నిత ప్రాంతాలుగా గుర్తింపు పొందిన భోగాపురం మండలం ముంజేరు, నెల్లిమర్ల మండలం మల్యాడ గ్రామాల్లో ఓటర్లకు మంగళవారం అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకొనే స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించామని, శతశాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ స్థాయి అవగాహనా గ్రూపులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని, పోలీసు శాఖ నుంచి కూడా మరో సెక్టార్ అధికారిని నియమించామని తెలిపారు. ఓటు వేయడంలో తమకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఈ గ్రూపు సభ్యులకు, సెక్టార్ అధికారులకు లేదా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా కేంద్రం నుంచే వీటిని పర్యవేక్షిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటివద్దనే ఓటుహక్కును వినియోగించే అవకాశాన్ని తొలి సారి ఈ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. ముందుగా ధరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని కలెక్టర్ చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ధైర్యాన్ని, భరోసాను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో ఇప్పటికే పోలీసు కవాతు నిర్వహించామన్నారు. ఓటు వేయడంలో ఏమైనా సమస్యలు ఎదురవుతాయని భావిస్తే, నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. గత ఎన్నికలో జరిగిన వివాదాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలను చేపట్టామన్నారు. దీనిలో భాగంగా కొందరిని బైండోవర్ కూడా చేశామన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని, దీనిపై ఎటువంటి సందేహాలు పెట్టుకో కుండా, ప్రతీ ఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పి కోరారు. ఈ కార్యక్రమాల్లో ట్రైనీ ఐపిఎస్ అధికారి మండ జావలి ఆల్ఫాన్స్, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐలు ఎ.రవికుమార్, వెంకటేశ్వర్రావు, రెండు మండలాల తాశిల్దార్లు శ్యామ్ ప్రసాద్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కలసి నడుద్దాం- వైకాపాని తరిమేద్దాం!

లోకం మాధవి

విశాలాంధ్ర- పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజక వర్గం లోని పూసపాటిరేగ మండలంలో, నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన జనసేన-తెలుగుదేశం-బిజెపి ఆత్మీయ సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు మాట్లాడుతూ అధిష్టానం మాటే శిరోధార్యమని, అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గెలుపునకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బడుకొండని ఇంటికి సాగనంపి ఒక మంచి పాలనతో నియోజకవర్గాన్ని అభివృద్ధిబాటలో నడిపిద్దామని, తమ పూర్తి మద్దతు లోకం మాధవి గాజు గ్లాసు గుర్తుకేనన్నారు. లోకం మాధవి మాట్లాడుతూ ఈ 5 ఏళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని,రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, నెల్లిమర్ల మాజీ ఎంపీపీ సువ్వాడ రవి శేఖర్, పూసపాటిరేగ మాజీ ఎంపీపీ మహంతి చిన్నం నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మహంతి శంకర్రావు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, తెలుగుదేశం పార్టీ మాజీ లీగల సెల్ అధ్యక్షుడు పతివాడ అప్పల నాయుడు, డెంకాడ సీనియర్ నాయకులు పాణిరాజు, తదితర్లుపాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీం విధులు సక్రంగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి పిలుపునిచ్చారు. పురపాలక సంఘ సిబ్బంది మరియు సచివాలయాల సిబ్బందితో అర్బన్ లెవెల్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఏర్పాటు చేసి పురపాలక సంఘ పరిధిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సభ్యులకు ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల ప్రచారం ర్యాలీలో పొందవలసిన అనుమతులు మరియు పాటించవలసిన నియమాల గురించి సిబ్బందికి తెలియజేశారు. పురపాలక సంఘ పరిధిలో ఏర్పాటు చేసిన బ్యానర్లు మరియు ఫ్లెక్సీలను తొలగించాలని, ఇంటింటి ప్రచారంలో భాగంగా అంటించిన స్టిక్కర్లను సైతం తొలగించాలని, ఇంటి యజమాని అనుమతి లేకుండా ఏ ఇంటి పైన ఎటువంటి జండాలను గాని వాల్ రైటింగ్స్ గాని చేయకుండా చూడాలని, ఒకవేళ ఇంటి యజమాని అనుమతి ఉన్నప్పటికీ ఇంటి పైన మూడు జండాలకు మించి పెట్టకుండా చూసుకోవాలని తెలియజేశారు. మైక్ మరియు సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినట్లయితే వాటికి సరిపడా అనుమతులు ఉన్నవి లేనివి తనిఖీ చేయాలని ఆదేశించారు. సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, వార్డుల్లో ప్రచారాలు జరిగేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలియజేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలులో ప్రతి ఒక్కరూ బాధ్యత గుర్తెరిగి విధులు నిర్వహించాలని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , ఈవోపీఆర్డీ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ మరియు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ తదితపాల్గొన్నారు. ..

గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా సమన్వయ అధికారి పద్మజ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వేపాడ శివారు బక్కు నాయుడు పేటలో గల అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా సమన్వయ అధికారిని టి.పద్మజ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ముందుగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు ఎలా రాస్తున్నారన్నా విషయం పై ఆరా తీశారు. అలాగే జరగబోయే పరీక్షలకు కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వంట శాలలో విద్యార్థులకు పెట్టే భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె పాఠశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడుతూ శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను ప్రత్యేక క్లాసులను ఏర్పాటు చేసి చదివించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయురాలు లక్ష్మి, తదితరులు ఉన్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమ్మె చట్ట వ్యతిరేకం

జెసిఎల్ ఉత్తర్వులు జారీ

మిమ్స్ డీన్ సిహెచ్ లక్ష్మికుమార్

విశాలాంధ్ర-నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగుల సమ్మె చట్ట వ్యతిరేకమని జెసిఎల్ ఉత్తర్వులు జారీ చేశారని మిమ్స్ డీన్ సిహెచ్ లక్ష్మికుమార్ వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం నెల్లిమర్ల మిమ్స్ వైద్యకళాశాలలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిమ్స్ ఉద్యోగులు తక్షణమే విధుల్లోకి చేరాలని హితవు పలికారు. మిమ్స్ ఉద్యోగుల సమ్మె చట్టవ్యతిరేకమని విశాఖపట్నం జెసిఎల్ గణేషన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. మిమ్స్ ఉద్యోగులు ముందస్తు నోటీసు ఇవ్వకుండా మెరుపు సమ్మెకి దిగడం చట్టవిరుద్ధమని జెసిఎల్ ఉత్తర్వుల్లో పొందిపరిచారని చెప్పారు. ఉద్యోగుల సమ్మెకు వెళ్లకముందు 14 రోజులు ముందు నోటీసు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వైద్యకళాశాల ఆసుపత్రి అత్యవసర సేవలు, ప్రజా వినియోగ సేవలు కిందకి వస్తాయని చెప్పారు. మిమ్స్ ఉద్యోగులు తలపెట్టిన చట్టవ్యతిరేక సమ్మెని విరమించి తక్షణమే విధుల్లోకి చేరాలని చెప్పారు. మిమ్స్ ఉద్యోగుల సమ్మె చట్టవ్యతిరేకం కనుకనే పోలీసులు 47 మందిపై బైండవర్ కేసులు నమోదు చేసి ఆర్డీఓకి సిఫార్సు చేశారని చెప్పారు. జెసిఎల్ ఉత్తర్వులకు కట్టుబడి మిమ్స్ ఉద్యోగులు తక్షణమే విధుల్లోకి చేరాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఏఓ గణేష్ ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కేసులు

- నేటి వరకు 12 కేసులు నమోదు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారి పై కేసులను నమోదు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో శుక్రవారం వరకు 12 ఉల్లంఘన కేసులను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఎస్.కోట నియోజకవర్గానికి చెందినవి 3 కేసులు, రాజాం నియోజకవర్గానికి చెందినవి రెండు కేసులు, నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందినవి 2 కేసులు, చీపురుపల్లి, బొబ్బిలి నియోజకవర్గాలకు చెందినవి ఒక్కొక్కటి కాగా విజయ నగరం నియోజకవర్గానికి చెందినవి 3 కేసులను పోలీస్ లు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో అనుమతులు లేకుండా ప్రచారం చేపట్టినవి, ఓటర్లను ప్రలోభ పెట్టేలా వస్తు పంపిణీలు, మద్యం బాటిళ్ళ అక్రమ నిల్వలు, కొత్తగా పనులు ప్రారంభించినందుకు, గరివిడి, ఎస్.కోట మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు వాలంటీర్ల పై ఉల్లంఘనలకు సంబంధించి కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

25 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-రామభద్రపురం: 25 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసామని స్థానిక ఎస్సై జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీల్లో భాగంగా అతను తనిఖీ చేయగా 25 మద్యం సీసాలు లభ్యమయ్యాయని అని తెలిపారు. సీసాలు స్వాధీనం చేసుకుని అన్నారు.

జనసేనలో భారీగా చేరికలు

విశాలాంధ్ర-భోగాపురం: జనసేన పార్టీలోకి రోజురోజుకి వలసలు పెరుగుతున్నాయి. భోగాపురం పార్టీ కార్యాలయంలో పూసపాటిరేగ మండలం కందివలస కనిమెట్ట పంచాయతీలకు చెందిన నాయకులు నక్కాన రమణ, పులపా రాధా కృష్ణమూర్తి, జలపాల శ్రీనుతో రెండు వందల మంది శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి లోకం మాధవి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేనలో చేరవద్దని వైకాపా నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని ఆమె ఆరోపించారు. కానీ వైకాపా నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేను కచ్చితంగా ఇంటికి పంపించే తీరుతామని అన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ జనసేన పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరామని అన్నారు. కార్యక్రమంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు, నాయకులు పతివాడ శ్రీనివాసరావు, వరపుల సుధాకర్, పల్లంట్ల శ్రీనివాసరావు, జగదీష్, పల్ల రాంబాబుతదితరులు పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు.శాంతి, సుస్థిరతను పెంపొందించడంలో నీటి వనరుల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసంశాంతి కోసం నీటిని అందించడం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన వాటర్ సప్లై అసిస్టెంట్ ఇంజనీర్ & హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. సురేష్, సామరస్యం, శ్రేయస్సును పెంపొందించడంలో నీటి యొక్క కీలక పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటి నిర్వహణలో విస్తృతమైన నైపుణ్యంతో, సురేష్ ఇతివృత్తంపై దృష్టి సారించి అంతర్దృష్టితో కూడిన ప్రదర్శనను అందించారు. ఆయన ప్రసంగం న్యాయబద్ధమైన నీటి వినియోగం, పరిరక్షణ ప్రయత్నాలు మరియు నీటి భద్రతను నిర్ధారించడానికి , నీటి కొరత నుండి ఉత్పన్నమయ్యే సంఘర్షణలను తగ్గించడానికి సహకార చర్యల యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి . శశిభూషణరావు మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ జీవితంలో నీటిని సంరక్షించడానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు, నీటి పరిరక్షణ, శాంతియుత సహజీవనం ప్రోత్సహించడంలో విద్యాసంస్థల కీలక పాత్రను గుర్చి తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ, శాంతి కోసం నీరు అనే థీమ్ ను వివరించారు.స్వచ్ఛమైన నీటి లభ్యత,సామాజిక స్థిరత్వం మరియు ప్రపంచ శాంతి ప్రయత్నాల మధ్య పరస్పర అనుసంధానాన్ని తెలియజేశారు. మరింత స్థిరమైన, సామరస్యపూర్వక భవిష్యత్తు కోసం నీటి సంబంధిత సవాళ్లను పరిష్కరించాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవికిషోర్, విభాగ ఇన్చార్జి ఎమ్. భార్గవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి : ఆర్డీఓ శాంతి

విశాలాంధ్ర-చీపురుపల్లి: ప్రజా ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి లేదంటే కఠిన చర్యలు తప్పవు అని ఎన్నికల అధికారి మరియు ఆర్‌డిఓ బి, శాంతి అన్నారు. శుక్రవారం చీపురుపల్లి ఆర్‌డిఓ కార్యాలయములో ప్రజా ప్రతినిధులతో నియోజకవర్గ తహసీల్దారులతో ఆర్‌డిఓ బి శాంతి సమావేశము ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె ప్రజా ప్రతినిధులను ఉద్దేసించి మాట్లాడారు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది, రాష్ట్రములో 144సెక్షన్ ఉంది, ఎన్నికలో ఎన్నికల ప్రచారములో సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలి ర్యాలీలు చేసిన బహిరంగ సభలు పెట్టిన వారం ముందే అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగస్తులు, వాలంటీరులు, ప్రజా ప్రతినిధులతో కలిసి తిరగకూడదు ప్రభుత్వ భవనాలపై నేతల ఫోటోలు ప్రకటనలు లేకుండా తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఫ్లయింగ్ టీమ్ తిరుగుతుంది తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తుంది. అన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు వేసిన వారం ముందు పూర్తి వివరాలు తెలుసుకొని నామినేషన్ వేస్తే మంచిది అభ్యర్థుల నామినేషన్ రిజక్ట్ అవకుండా చూసుకునే భాధ్యత మీదే అని అన్నారు. ఈ కార్యక్రమములో తహసీల్దార్ ప్రసాదరావు, సి ఐ షణ్ముఖరావు వై ఎస్ ఆర్ నాయకులు సువ్వాడ అప్పలనాయుడు, టీ డి పి నాయకులు గవిడి నాగరాజు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అజాత శత్రువుకు మరోసారి అవకాశం : కోళ్ళకు టిక్కెట్‌పై నేతల్లో హర్షాతిరేకాలు

విశాలాంధ్ర-జామి: ఎస్‌కోట టీడీపీలో ఎస్‌కోట అంటే కోళ్ళ.. కోళ్ళ అంటే ఎస్‌కోట అనేది నానుడి. ఈవిషయాన్ని గుర్తించిన తెలుగుదేశం అధిష్టానం అజాతశత్రువుగా పేరొందిన కోళ్ల లలితకుమారిని మరోసారి తమ అభ్యర్థిగా ఎంపిక చేసింది. శుక్రవారం ఉదయం పలు స్థానాలకు టీడీపీ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది. అందులో భాగంగా ఎస్‌కోట అభ్యర్థిగా కోళ్ళ లలితకుమారి పేరును ప్రకటించగానే నియోజక వర్గంలోని 5 మండలాలకు చెందిన టీడీపీ క్యాడర్ లో ఉత్సాహం నెలకొంది. వెంటనే తమ అభిమా నాన్ని తెలిపేందుకు కోళ్ళ స్వగృహం ఎల్‌కోటకు తరలివెళ్ళారు. జామిలో టీడీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. దాదాపు 10 సార్లు కోళ్ళ కుటుంబానికి ఎమ్మెల్యే టిక్కెట్ వచ్చింది. ఎంతమంది పార్టీలు మారినా కోళ్ళ కుటుంబం మాత్రం టీడీపీని నమ్ముకుంది. ఎన్నికష్టాలు వచ్చినా, ఎంతమంది తమ పార్టీలోకి తీసుకువెళ్ళేందుకు ప్రయ త్నించినా చంద్రబాబుతోనే తమ ప్రయాణం అంటూ భీష్మించారు. అదే ఇప్పుడు వారికి టిక్కెట్ వచ్చేందుకు దోహదపడిందని నియోజకవర్గ ప్రజలు చెప్పుకుంటున్నారు.

లక్కవరపుకోట: మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని మూడవ జాబితాలో టీడీపీ పార్టీ టిక్కెట్ ప్రకటించడంతో మండల కేంద్రంలోని కోళ్ల నివాసంవద్ద నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటామని అన్నారు. బాబుపై ఎల్లప్పుడూ విశ్వసనీయత కలిగి రుణపడి ఉంటామని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసి తాను అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఆశీస్సులు ఎల్లప్పుడూ తమకు పుష్కలంగా లభిస్తున్నాయని జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ, ఉమ్మడిగా పనిచేసి విభేదాలు లేకుండా ఐకమత్యంతో తమ గెలుపుకు కృషి చేస్తారని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని వర్గాల ప్రజలను కోరుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మీ అందరి అభిప్రాయం ప్రకారం ఇండిపెండెంట్ గా పోటీకీ సిద్ధం : గొంపకృష్ణ

- మరో రెండు రోజులు వేచి చూసి నిర్ణయం తీసుకుందాం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా..

విశాలాంధ్ర-శృంగవరపు కోట : మీ అందరి అభిప్రాయం ప్రకారం ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేసేందుకు నేను సిద్ధమని నియోజక వర్గ యువనేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఐదు మండలాల నాయకులు, వందలాది కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ప్రకటించారు. ఎస్.కోటలోని తన కార్యాలయంలో వందలాది మంది కార్యకర్తలు, నేతలనుద్దేశించి శుక్రవారం సాయంత్రం గొంప క్రిష్ణ మాట్లాడుతూ హైదరాబాదులో ఉన్న నాకు గురువారం సాయంత్రం 4గంటలకి సత్య దామజర్ల నుంచి నాలుగైదు సార్లు ఫోన్ వచ్చింది. అయితే నా ఫోన్ మ్యుటులో ఉండటంతో తర్వాత చూసి వెంటనే 4గంటల 5 నిమి షాలకు సత్యాకు ఫోన్ చేస్తే చంద్రబాబు నాయుడు నుంచి ఇప్పుడే ఫోన్ వచ్చిందని.. నాకు ఎస్.కోట టిక్కెట్ కన్ఫర్మ్ అయిందని, ఈరోజు లేదా లేదా ఉదయం ప్రకటి స్తారని చెప్పారు. సరే రాత్రి ప్రకటించలేదని.. ఉదయం హైదరా నుండి విమానంలో బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో టీడీపీ జాబితా విడులైందని, అందులో తన పేరు లేదు. ఏమయ్యిందో ఏమో ఇంతలో పేరు మారిపోయింది. ఎవరూ కూడా నాతో చర్చించలేదు కూడా. ఇక జాతీయ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆదేశాలు మేరకు ఇక్కడకు ఒక్కడినే వచ్చి అనతికాలంలోనే మీ అందరి అభిమానం చూరగొని నియోజక వర్గంలో ఒక నాయకునిగా ఎదిగాను. గతంలో లోకేష్ బహిరంగ సభను కూడా సక్సెస్ చేసాం. మీ అందరికీ ఒకటే చెబుతున్నా జరిగిన పరిణామాలు మీకు బాధ కలిగిస్తున్న విషయం నాకు తెలుసు. అందరం మరింత ఐక్యంగా ఉండి సమన్వయంతో ముందుకు వెళ్దామని గొంప సముదాయించారు.

- పార్టీ ఆదేశాలను ఇప్పటివరకు గౌరవించాం..

తన అనుచరులకు సముదాయిస్తూ ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడుతూ వచ్చాం. పార్టీకి కట్టుబడి ఇన్నిరోజులు ఎటువంటి గొడవలు లేకుండా ఇదే పార్టీలో ఉన్న పెద్దలు మనల్ని ఎన్నోమాటలతో చెప్పలేని విధంగా మనల్ని అవమానించినా ఓపిగ్గా భరించి ఉన్నాం. కానీ ఇప్పుడు ఇన్నాళ్లు నాతో తిరిగిన అందరికి మాట ఇచ్చిన ప్రకారం మీరంతా ఏమి చెపితే అది చేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను. పార్టీ పెద్దలు ఆదేశానుసారం ఇన్నాళ్లు పార్టీని బ్రతికించుకొచ్చాం. కానీ మనమంతా గళం విప్పాల్సిన సమయం వచ్చింది. కావున అందరం ఏకత్రాటిపై నిలబడి ఏమి చేద్దాం అంటే అదే చెయ్యటానికి నేను సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. దీంతో అభిమానులంతా ఒక్కసారిగా జై గొంప. .జై జై గొంప అంటూ నినాదాలు చేసారు.

ఇక్కడే ఉండి మీ అందరి కష్ట సుఖాల్లో పాల్గొంటా..

ఇక్కడే ఎస్.కోటలోనే ఉండి మీ అందరి కష్టసుఖాల్లో పాల్గొంటా అని గొంప తెలిపారు. కొత్తవలస గొరపల్లి రాము, ఎస్.కోట నుండి రాయవరపు చంద్రశేఖర్, జామి నుండి లగుడు రవి, పైడిబాబు, వేపాడ గొంప వెంకట రావు ఇలా అందరు నాయకులు ప్రజాబలం ఉన్నవారే. అందరం చర్చించి ఏదైనా నిర్ణయం తీసుకుందాం. అవసరమైతే చంద్రబాబు, లోకేష్ బొమ్మ పెట్టుకుని వేరేగుర్తుతో ఇండిపెండెంట్ గా పోటీకి వెళ్దామని గొంప వెల్లడించారు.

- గొడవ పెట్టుకోవాలంటే నిమిషం పని..

గొడవ పెట్టుకోవాలంటే నిమిషం పని. కొంతమంది నన్ను కవ్వించేలా కామెంట్స్ పెట్టారు. జ్ఞానం, పార్టీ ఇచ్చిన ఆదేశాల ప్రకారం అన్నీ భరించాం. ఇకపై అలాకాదు సహనం కోల్పోయినట్టు కామెంట్స్ చేసే వారిని ఇంటికి వెళ్లి తన్నడానికి సిద్ధమని గొంప క్రిష్ణ వెల్లడించారు. టీడీపీ సీనియర్ నాయకులు రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవి, గొరపల్లి రాము, ఇప్పాక త్రివేణి, గుమ్మడి భారతి, పైడిబాబు తదితరులు మాట్లాడుతూ చచ్చిపోతున్న టీడీపీని గొంప క్రిష్ణ బ్రతికించారు. అలాంటి నేతకు టీడీపీ అధిష్టానం ఇచ్చిన గౌరవం ఇదా. అవసరమైతే కార్యకర్తలు, నాయకులు అందరం చర్చించుకుని గొంపక్రిష్ణ ఇండిపెండెంట్ గా పోటీలో ఉంటారంటూ ప్రకటించారు. కాగా ఆగ్రహంతో ఉన్న కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి ఉన్న టీడీపీ సైకిల్ గుర్తు వంటివి పెయింట్ తో చెరిపేశారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి గొంప క్రిష్ణ రాజీనామా...

శృంగవరపుకోట నియోజకవర్గం యువనేత వారి పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి గొంప క్రిష్ణ రాజీనామా చేశారు. వీరితో పాటు వేపాడ మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు, కొత్తవలస మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి రాము, జామి మండల పార్టీ అధ్యక్షులు లగుడు రవికుమార్, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్ర శేఖర్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి వారి వారి పదవులకు రాజీనామా చేశారు.

గుర్ల తమ్మి రాజుపేట లోరసవత్తరంగా జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర-మెంటాడ: మండలంలో గుర్ల తమ్మి రాజుపేటలో శ్రీ ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా మండల స్థాయి పురుషుల వాలీబాల్ ,జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు గురువారం రాత్రి 10 గంటల వరకు కబడ్డీపోటీలు ప్రేక్షకులు చప్పట్ల మధ్య రసవత్తరంగా పోటీలు సాగాయని ఏర్పాట్లు నిర్వహించిన కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. గుర్ల తమ్మి రాజుపేట అమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకులు చొక్కాకు సన్యాసి నాయుడు, కొండమ్మ దంపతులు ఈ మహిళల కబడ్డీ పోటీలను లాంచనప్రాయంగా ప్రారంభించారు. రాత్రి 10 గంటలవరకు సాగిన ఈ కబడ్డీ పోటీల్లో జిల్లా మొత్తం నుండి వివిధ రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న 5 మహిళా కబడ్డీ టీములు వారు ప్రదర్శించిన ఆటను చూసి ప్రేక్షకులు మంత్రము గ్ధులయ్యారు. చివరకు కబడ్డీ పోటీల్లో ప్రధమ తృతీయ, తృతీయ ,చతుర్ధ స్థానాల్లో నెల్లిమర్ల, గుర్ల, ఎల్ కోట,కుమిలి టీములు గెలుపొందాయి. ఈ పోటిలలో గెలుపొందిన ప్రధమస్థానంలో నిలిచిన నెల్లిమర్ల జట్టుకు 10వేల నగదు తోపాటు మెమెంటో, అలాగే ద్వితీయ బహుమతి గుర్ల జట్టుకు 6వేలునగదు, మెమెంటో,తృతీయ స్థానంలో నిలిచిన ఎల్ కోట జట్టుకు 4వేలు నగదు, మెమెంటో, నాలుగో స్థానంలో నిలిచిన కుమిలి జట్టుకు 2వేలు నగదు, మెమెంటో అందజేయడం జరిగిందని శ్రీరాములు తెలిపారు. అనంతరం జిల్లాలో కబడ్డీ ఆటకు పితామహుడిగా పేరుగాంచిన రిటైర్డ్ మ్యూజికల్ డైరెక్టర్ ఫిజికల్ డైరెక్టర్ బొమ్మన రామారావు ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామ పంచాయతి కార్యాలయం - బొండపల్లి
వేలం మరియు టెండరు ప్రకటన

రేఖా నెం.12/2024 తేది:22/03/2024

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బొండపల్లి గ్రామ పంచాయతికి చెందిన ఈ దిగువ మదహరించిన షెడ్యూల్ 1 ప్రాప్తికి 2024-25 సంవత్సరమునకు పారిశుధ్య పనుల నిర్వహణ, మరియు నిర్వహణ గురించి ఈ దిగువ చూపిన విధముగా తేది : 26-03-2024 ఉదయం 10:30 గంటల నుండి 1:30 వరకు గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద షీల్డ్ టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 2:30 గంటలకు హాజరు అయిన టెండరు దారుల సమక్షంలో సదరు టెండర్లు తెరవబడును. వేలం పాటలో పాల్గొన్న వారు మరియు షీల్డు టెండర్లు వేయగోరు వారు ఈ పంచాయతీ షరతులకు లోబడి షెడ్యూలులో చూపిన ప్రకారం చెల్లింపవలసిన ధరావత్తులు ముందుగా చెల్లించి ధరావత్తులు రసీదుతో పాటు షీల్డ్ టెండర్లు దాఖలు చేయవలెను. ధరావత్తులు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు రూ.25000/- (అక్షరముల ఇరవై అయిదు వేలు రూపాయలు) ఆస్తి విలువ గల ధృవపత్రం (సాల్వెన్సీ సర్టిఫికేటు) దాఖలు చేయవలెను, మిగిలిన వివరములు ఈ కార్యాలయం పని వేళలో స్వయముగా వచ్చి తెలుసుకోగలరు.

షెడ్యూలు - 1

వరుస	వివరములు	సంవత్సరం	ధరావత్తు
1	కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య పనులు నిర్వహించుటకు 3 మందిని సప్లయ్ చేయుటకు	2024-25	1500
2	కాంట్రాక్ట్ పద్ధతిపై PWS స్కీములు ఆపరేట్ చేయుటకు 1రిని సప్లయ్ చేయుటకు	2024-25	600

గమనిక : 1)ఈ గ్రామ పంచాయతీ కాంట్రాక్టు పనులు నిర్వహించు వారు శ్రీ జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం వారికి లోబడి టెండర్లు దాఖలు చేయబడును. 2) కాంట్రాక్టరు కాంట్రాక్ట్ లేబర్‌కు రెండు జతలు బట్టలు, చెప్పులు, సబ్బులు మరియు కొబ్బరి నూనె సరఫరా బాధ్యత వహించి టెండరు దాఖలు చేయవలెను 3) టెండరుదారు కాంట్రాక్టు లేబర్‌కు బీమా మరియు PF చేయించవలెను.

శ్రీ బొండపల్లి ఈశ్వరరావు
సర్పంచ్ / గ్రామ పంచాయతి. బొండపల్లి

జి.శ్రీనువాసురావు
పంచాయతి కార్యదర్శి / గ్రామ పంచాయతి. బొండపల్లి

సజావు ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పలు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర-విజయ నగరం టౌన్: జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో శుక్రవారం టూ టౌన్ పోలీసుస్టేషను పరిధి లోని పూల్ బాగ్, ఖాదర్ నగర్, బాబామెట్ట, దాసన్నపేట ప్రాంతాల్లో టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె.రామారావు, ఎస్ఐ శ్రీ రాజేష్ ఆధ్వర్యంలో సివిల్ మరియు కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మే 13న రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుటకు చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి, శాంతియుతంగా ఎన్నికల నిర్వ హణకు ప్రజలంతా సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా కోళ్ల లలితకుమారి

మూడవ జాబితాలో ప్రకటించిన తెలుగుదేశం కోళ్ల అభ్యర్థిత్వం ఖరారుతో మండలాల్లో సంబరాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా కోళ్ల లలితకుమారిని తెలుగుదేశం పార్టీ అధిష్టానం శుక్రవారం విడుదల చేసిన మూడవ జాబితాలో ప్రకటించింది. దీంతో నియోజకవర్గ పరిధి మండలాల్లో నాయకులు, కార్యకర్తలు, కోళ్ల కుటుంబ అభిమానులు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి, ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని పార్టీ శ్రేణులు స్పష్టం చేస్తున్నారు. ఇక విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గం అనేది తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కంచుకోటగా పేరుంది. ఈ నియోజకవర్గం విజయనగరం జిల్లాలో ఉన్నప్పటికీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. గత అరవై ఏళ్లుగా ఈ నియోజకవర్గానికి ఘనచరిత్ర ఉంది. కీర్తిశేషులు కోళ్ల అప్పలనాయుడు 1962లో రేవిడి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగాను 1967లో శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రెండుసార్లు గెలిచారు. అలాగే రాష్ట్రంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినాటి నుండి తెలుగుజాతి అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన టీడీపీ ఆవిర్భావం నుండి కోళ్ల కుటుంబం 1983, 1985, 1989, 1994, 1999, 2009, 2014 వరుసగా ఏడు సార్లు టీడీపీ అభ్యర్థిగా కోళ్ల కుటుంబం గెలుపొందగా, 2004, 2019 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రమే ఓటమి పాలయ్యారు. ఇందులో 1962 నుండి 2019 వరకు జరిగిన 11 సార్లు ఎన్నికల్లో తొమ్మిది సార్లు గెలుపొంది రెండుసార్లు మాత్రమే ఓటమిని చవిచూశారు. కోళ్ల లలితకుమారి 25-3-1970 లో జన్మించారు. ఈమె ఇంటర్మీడియట్(సీఈసీ) చదివారు. ఇక 2006 నుండి 2009 వరకు ఎల్.కోట మండల ప్రజాప్రతినిధి (ఎంపీపీ)గానూ, 2009 నుండి 2012 విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలుగా మరియు 2009 నుండి 2019 వరకు అసెంబ్లీలో వివిధ కమిటీలకు సభ్యురాలుగా పనిచేశారు. అలాగే 2015 నుంచి 2017 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యురాలుగా స్వామి వారికి సేవలు అందించారు. 2012 నుండి 2014 వరకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా అతి తక్కువ సమయంలో అత్యధిక ప్రజాదరణ పొందిన రాజకీయ మహిళ నాయకురాలిగా లలితకుమారి పేరు తెచ్చుకున్నారు. అలాగే ఆమె భర్త కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ ప్రస్తుతం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతూ గతంలో 1995 నుంచి 2000 వరకు కూడా జడ్పిటిసి గాను మరియు 2000 సంవత్సరం నుంచి 2005 వరకు ఎంపీపీ గాను ప్రజలకు సేవ చేశారు. ఇలా సుదీర్ఘ రాజకీయ చరిత్ర మరియు ప్రజాధారణ కలిగిన కోళ్ల కుటుంబం 2024లో కూడా టీడీపీ అభ్యర్థిగా కోళ్ల లలిత కుమారి 100% గెలుపు ఖాయమని నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రత్యర్థి పార్టీ పది మంది అభ్యర్థులు మారారు. కానీ టీడీపీ నుంచీ 40 సవంత్సరాలుగా ఒక్కరే అభ్యర్థిగా ఉన్నారు. కాబట్టే శృంగవరపుకోట నియోజకవర్గం అంటే కోళ్ల కుటుంబం, కోళ్ల అంటే టీడీపీ, టీడీపీ అంటే కోళ్ల...అనే పేరు నానుడిలో ఉంది. గత 40 సవంత్సరాలగా కోళ్ల కుటుంబాన్ని నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ఉత్తరాపల్లి, శృంగవరపుకోట నియోజకవర్గాలలో అత్యధిక సార్లు లక్కవరపుకోటకు చెందిన కోళ్ల అప్పలనాయుడు కుటుంబం ఎమ్మెల్యేలను దక్కించుకున్నారు. వీటిలో ఉత్తరాపల్లి నియోజకవర్గం నుండి కీ.శే.కోళ్ల అప్పలనాయుడు 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా పదవిని చేపట్టి ఇటు ఉత్తరాపల్లి నియోజకవర్గానికి, అటు శృంగవరపుకోట నియోజకవర్గానికి ఎనలేని సేవ చేసి, ప్రజాదరణ పొందిన రాజకీయ కుటుంబం అని చెప్పవచ్చు. అనంతరం 2009 ఎన్నికల్లో ఉత్తరాపల్లి నియోజకవర్గాన్ని రద్దుపరిచి శృంగవరపుకోట నియోజకవర్గంలో కలపడంతో స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు కోడలు (మనుమరాలు) కోళ్ల లలిత కుమారి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తనదైన శైలిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధితో పాటుగా ప్రజల మన్ననలను పొందారు. గత నాలుగు దశాబ్దాల కాలం నుండి శృంగవరపుకోట రాజకీయ చరిత్రలో ఎలాంటి మచ్చలేని ఒకే ఒక రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం కోళ్ల కుటుంబం మాత్రమే అని అనడంలోఎటువంటి సందేహం లేదు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో అన్ని గ్రామాల ప్రజలను, ప్రతీ ఒక్కరినీ కూడా తమ సొంత కుటుంబ సభ్యుల్లా అమ్మ, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు అంటూ...పేరులతో సహా పలకరించే పరిచయం, చనువు ఉన్న రాజకీయ కుటుంబం ఒక్క కోళ్ల కుటుంబం మాత్రమే. 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా వీచిన అనుకూల గాలి వీయడంతో కోళ్ల లలిత కుమారి పదివేల లోపు ఓట్ల తేడాతో పరాజయం పొందారు. ఆ ఎన్నికల్లో విజయనగరం జిల్లా ఫలితాలను పరిశీలిస్తే మొత్తం తొమ్మిది నియోజకవర్గాలు వైసీపీ క్లీన్ స్లీప్ చేయగా, అన్ని నియోజకవర్గాల్లో కూడా వైసీపీ అభ్యర్థులు 20 వేలకు పైచిలుకు ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. కానీ ఒక్క శృంగవరపుకోట నియోజకవర్గంలోని కేవలం 10 వేల ఓట్లు లోపు మాత్రమే వైకాపాకు దక్కడం గమనార్హం. ఒక బీసీ నాయకురాలిగా, మహిళగా, సౌమ్యరాలిగా, తెలుగుదేశం పార్టీకి విధేయరాలుగా గత ఐదేళ్లలో ఎలాంటి అధికారం లేకపోయినా పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రజా పోరాటాల్లోనూ చురుకుగా పాల్గొని, వారికి తోడుగా నిలిచి స్నేహశీలిగా కోళ్ల లలిత కుమారి ప్రజాదరణను చూరగొన్నారు.

పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు పైపులైన్ ఫిట్టర్ లతో భోజరాజపురం ప్రధాన నీటి సరఫరా కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి శుక్రవారం సందర్శించారు.వేగవతి నదిలో ఉన్న మూడు ఇన్ ఫిల్టరేషన్ బావులను సందర్శించి అందులో ఉన్న మోటార్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్యాలరీ వెల్ ను బోర్లను పరిశీలించి బోర్డర్లో ఉన్న మోటర్లకు ఏమైనా మరమ్మతులు ఉన్నాయో గుర్తించి వాటికి మనం మత్తులు చేయించి రిజర్వులో ఉంచుకోవాలని ఆదేశించారు. 100 హెచ్ పి మరియు 30 హెచ్ పి మోటార్లను మరియు ఎలక్ట్రిక్ లైన్లను పరిశీలించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా మరమ్మతులు చేయించు కోవాలని ఆదేశించారు. క్లోరినేషన్ నిల్వలను పరిశీలించారు. పట్టణంలో ఉన్న వివిధ ప్రాంతాల్లో లీకులను గుర్తించి వాటిని వెంటనే అరికట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల పట్ల మరియు మోటార్ల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సరిపడినంతగా ఉన్నందున రానున్న రెండు నెలల్లో త్రాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు.

శ్రీకోటమ్మతల్లి సిరిమాను చెట్టును మేళతాళాలతో కొట్టాం గ్రామానికి తరలింపు..

- ఎల్.కోట మండలం, గొల్జాం గ్రామంలో సిరిమాను చెట్టు గుర్తింపు
- ఏప్రిల్ 2న తొలేళ్ళు, 3న సిరిమాను సంబరం

విశాలాంధ్ర:-శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర కల్పవల్లి.. కొట్టాం గ్రామదేవత శ్రీకోటమ్మ అమ్మవారి సిరిమాను సంబరాలు ఏప్రిల్ 1, 2, 3 తేదీలలో జరగనున్నాయి. 2న అమ్మవారి తొలేళ్ళు, 3న సిరిమాను సంబరం జరుగనుంది. ఇక కోటమ్మతల్లి సిరిమానోత్సవానికి వినియోగించే చెట్టును ఎల్.కోట మండలం, గొల్జాం గ్రామంలో పూజారి గుర్తించారు. ఆలయం ఈఓ నాగేంద్ర, చైర్మన్ శానాపతి రమణ బాబు ఆధ్వర్యంలో కొట్టాం గ్రామస్తులు, భక్తులు పెద్దఎత్తున గోల్జాం తరలివెళ్లి సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిమాను చెట్టును పూజారి రంది నాగ భూషణం, బురద పూజారులు, ఆలయ సిబ్బంది, ఈఓ నాగేంద్ర, చైర్మన్ రమణ బాబు, కోటమ్మతల్లి మాలధారణలో ఉన్న భక్తులు సమక్షంలో మేళతాళాలతో కొట్టాం గ్రామానికి నాటుబండిపై గురువారం అర్ధరాత్రికి కొట్టాం గ్రామంలోని గద్దె గుడి వద్దకు తరలించారు. ఈ కార్యక్రమంలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి సిరిమాను చెట్టును తరలింపు సందర్భంగా జై కోటమ్మ.. జై జై కోటమ్మా నినాదాలు మిన్నంటాయి.

పండగల నిర్వహణలో ఎన్నిక ప్రవర్తన నియమావళి పాటించాలి

తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, సిఐ రవికుమార్

విశాలాంధ్ర-భోగాపురం: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో గ్రామాల్లో జగనున్న పండగలలో తప్పకుండ ఎన్నిక ప్రవర్తన నియమావళి పాటించాలని భోగాపురం తహసీల్దార్ శ్యామ్ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో భోగాపురం, పోలిపల్లి, లింగాల వలస గ్రామాల్లో ఈనెల గ్రామ దేవతల పండగలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసిల్దార్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి సంబంధించిన అన్ని విషయాలను తెలియజేసారు. రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు గాని, వ్యక్తుల ఫోటోలు గాని పేర్లు గాని ఎక్కడా ప్రచురించకూడదని తెలిపారు. భోగాపురం పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.రవికుమార్ మాట్లాడుతూ పండగ సందర్భంగా ఎటువంటి అశ్లీల కరమైన నృత్యాలు గాని, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు గాని ఎవరూ పాల్పడకూడదని అన్నారు. పండగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు, ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకళ, ఉత్సవ కమిటీ సభ్యులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన బిజెపి టిడిపి టిడిపి ఉమ్మడి అభ్యర్థి

బేబినాయన గెలుపునకు పనిచేయండి

జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ అప్పలస్వామి

విశాలాంధ్ర-బొబ్బిలి : జనసేన బిజెపి టిడిపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన గెలుపు కోసం జన సైనికులు కష్టపడి పని చేయాలని జనస్తే నియోజకవర్గ ఇన్చార్జ్ గిరడ అప్పలస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఇంచార్జ్ అప్పలస్వామి విలేకరులతో మాట్లాడారు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అంతా సమిష్టిగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన ని అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా పిలుపునిచ్చారు. జనసేన పార్టీలో విభేదాలు ఉన్నాయన్న వదంతులను కొట్టిపారేశారు. స్వలాభం కోసం జనసైనికులను వాడుకుంటూ డేటా కలెక్షన్ చేస్తూ పక్క పార్టీలకు అమ్ముకోవాలని చూస్తున్నా కొందరు వ్యక్తులను ప్రజలు, జనసైనికులు నమ్మవద్దని వారించారు. శ్రీ వేణుగోపాల స్వామి కోవెల సెంటర్ వద్ద ఉన్న పార్టీ ఆఫీస్ మాత్రమే జనసైనికులకు ప్రామాణికమని అందరూ కలిసికట్టుగా ఇక్కడి నుంచే పని చేసి పార్టీని ముందుకు నడిపిం చాలని కోరారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఇన్చార్జ్ ఆధాడ మోహన్ మాట్లాడుతూ పార్టీని వినియోగించుకొని జనసైనికు లను ప్రలోభ పెడుతూ వాడుకుంటున్న వారిని నమ్మవద్దని పార్టీలో అఫీషియల్ గా ఉన్న వ్యక్తులను మాత్రమే జనసైనికులు సంప్రదించాలని, గ్రూపులు కట్టకుండా అందరూ కూడా జనసేన పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బొబ్బిలి జనసేన నాయకులు పెద్దింటి మనోజ్ కుమార్, మొకర సాయి శంకర్, బంటుపల్లి శంకర్రావు, బంటుపల్లి దివ్య, దాకారపు చంద్రమౌళి, చిక్కాల సందీప్, పైల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీ మనోభావాలకు అనుగుణంగా నడుచుకుంటా..

గజపతినగరం టీడీపీ అభ్యర్థి కె.శ్రీనివాస్

విశాలాంధ్ర-జామి: ఇప్పటి వరకు మీరంతా బాబాయి నాయుడు అనుచరులుగా గుర్తింపుపొందారు. మీకు బాబాయి హయాంలో ఎంత గౌరవం, మర్యాద ఉండేవో అంతేస్థాయిలో నేను కూడా మిమ్మల్ని గౌరవిస్తా. మీ మనోభావాలు దెబ్బతినకుండా మీరు చెప్పిన రీతిలోనే పాలన చేస్తాను'. అని గజపతినగరం టీడీపీ కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ సమావేశంను భీమసింగిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో శ్రీనివాస్ అందరితో మాట్లాడారు. బాబాయి మరికొద్ది రోజులలో మాతో కలిసి పనిచేస్తారని వివరించారు. గ్రామాలలో టీడీపీకి మంచి ఆదరణ ఉందని, అభ్యర్థి ఎవరైనా చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా, టీడీపీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు మాట్లాడుతూ తాము టిక్కెట్‌కోసం పైరవీ చేయలేదని, యువత కోటాలో చంద్ర బాబు ఎంపికలు చేసారని వివరిం చారు. రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం కావడంతో స్వత ‍హాగా తన కుమారునికి రాజకీయా లపై ఆసక్తి పెరిగిందన్నారు. స్వర్గీయ లగుడు సింహాద్రి వంటి నేతల ఆశీస్సులు మాకుటుంబంపై ఉన్నాయన్నారు. మీరంతా ఎంతో ఐక్యమత్యంగా ఉన్నారని, ఇదే టీడీపీ విజయానికి నాందిగా పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు స్వామినాయుడుతోపాటు ప్రధాన కార్యదర్శి దనియాల పైడిరాజు, పార్లమెంటరీ పార్టీ నేత కొత్తలి సూర్యా రావుతో పాటు 12 గ్రామాల నేతలు, కార్యకర్తలు కొండపల్లి శ్రీనివాస్ అభ్యర్థత్వంపై మద్దతు పలికారు. రానున్న ఎన్నికలలో శ్రీనివాస్ విజయానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసారు.

కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపే

ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి దయానంద్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్ కక్ష సాధింపులో భాగమేనని, ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.దయానంద్ అన్నారు. కేజ్రీవాల్‌ను ఈ.డి. అధికారులు అరెస్ట్ చేయడాన్ని ఆమ్ ఆద్మీ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలు శుక్రవారం తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడు తూ ఢిల్లీ లిక్కర్ కేసులో ఒక్క రూపా యి అవినీతికి పాల్పడినట్లు ఎటువంటి ఆధారాలు లేకపోయినా మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ లాంటి ఆప్ నేతలను జైళ్లలో పెట్టిందని అయినా బీజేపీ తో తాము రాజీ పడకపోవడంతో వల్లనే చివరికి సీఎం కేజ్రీవాల్ ను అక్రమంగా అరెస్ట్ చేసిందని అన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అపహాస్యం పాలవు తున్నాయని, రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయం బీజేపీకి పట్టుకుందన్నారు. బీజేపీ పాలన లో అవినీతి, అక్రమాలకు, అత్యాచారాలకు పాల్పడినవారు, బ్యాంకు లకు ఎగనామం పెట్టి విదేశాలకు వెళ్లేవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, నిజాయితీగా ప్రజల పక్షంగా పని చేసే ఆప్ నేతలను, విపక్షాలను మాత్రం అక్రమ అరెస్ట్ లు చేసి జైళ్లలో పెడుతుందని తెలియజేశారు. ఎలక్టోరల్ బాండ్ల అంశం నుండి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం బీజేపీ చేస్తుందని, ఎంతగా తమను వేదించినా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూనే ఉంటామని, తక్షణమే కేజ్రీవాల్ ను విడుదల చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకర్ రావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ తో బాటు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

24గంటలు గడవక ముందే నిందితులు అరెస్ట్

వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ బి.వెంకటరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణం తోటపాలెం ఎయిమ్స్ స్కూల్ వెనక భాగంలో మార్చి 21న పశువులను మేపుతున్న ఒక వృద్ధురాలి మెడలో చైను దొంగిలించిన ఇద్దరు నిందితులను 24 గంటలు గడవక ముందే అరెస్టు చేసి, దొంగిలించిన బంగారు చైను, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లుగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి.వెంకట్రావు మార్చి 22న తెలిపారు. వివరాల్లోకి వెళితే తోటపాలేం కు చెందిన బంక గురుమూర్తమ్మ (60 సం.లు) అనే వృద్ధురాలు ఎయిమ్స్ స్కూల్ వెనుక భాగంలో పశువులను మేపుతుండగా అక్కడకు వచ్చిన ఒక అపరిచిత వ్యక్తి సదరు మహిళ యోగ క్షేమాలు అడుగుతున్నట్లుగా మాట్లాడి, చుట్టు ప్రక్కల ఎవ్వరూ లేరని నిర్ధారించుకున్న తరువాత వృద్ధురాలి మెడలో చైను లాగుకొని, కొద్ది దూరంలో ఉన్న మరొక వ్యక్తి మోటారు సైకిలుపై ఇరువురు పరారీ అయినట్లుగా వన్ టౌన్ పోలీసులే స్టేషనులో ఫిర్యాదు చేయగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారన్నారు.వన్ టౌన్ క్రైమ్ ఎస్ఐ జే.తారకేశ్వరరావు, క్రైమ్ బృందం నేర స్థలంను సందర్శించి, కొన్ని ఆధారాలు సేకరించి, నేరంకు పాల్పడిన ఇద్దరు నిందితులను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. పూసపాటి రేగ చాకలివీధికి చెందిన నిందితులు (ఎ-1) మామిడి సత్య కుమార్ (ఎ-2) గురాన భార్గవ్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి బంగారు చైను, నిందితులు వినియోగించిన రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణలో నిందితులు ఫిబ్రవరి మాసంలో వెంకటేశ్వర స్వామి కోవెల సమీపంలో ఇదే తరహా నేరంకు పాల్పడినట్లు అంగీకరించారని ఇన్స్పెక్టర్ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసులో వన్ టౌన్ ఎస్ఐ జే.తారకేశ్వర రావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్లు శివ, గౌరీ శంకర్ క్రియాశీలకంగా పని చేశారని, వారిని ఉన్నతాధికారులు అభినందించారు సిఐ వెంకటరావు తెలిపారు.

ఎస్ కోట "కోళ్ల"కే నంట

-చీపురుపల్లిలో మాత్రం తెగని ఉత్కంఠ
- ఎంపి అభ్యర్థి ఎంపీకలోనూ సస్పెన్స్

విశాలాంధ్ర-విజయనగరం : ఎస్ కోట టీడీపీ తలుపులు లలితకుమారికే స్వాగతం పలికాయి. ఇన్నాళ్లు సాగిన సస్పెన్స్ కు అధిష్టానం ముగింపు పలుకుతూ కోళ్ల లలిత కుమారికే పోటీచేసే అవకాశం కల్పించింది.తెలుగుదేశం అభ్యర్థిగా 2009, 2014లో విజయం సాధించిన లలితకుమారి, 2019లో మాత్రం వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు చేతిలో 11 365 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఈసారి ఎన్నికలలో టికెట్ విషయంలో లలితకుమారి వర్గం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వచ్చింది.ఆమెతో పాటు గొంప కృష్ణ కూడా టికెట్ ఆశిస్తూ రావడంతో వీరిద్దరిలో ఎవరికి పోటీ చేసే అవకాశం దక్కుతుందో అనే ఉత్కంఠ కొనసాగింది. కోళ్ల లలితకుమారితో పాటు ,గొంప కృష్ణ కూడా నియోజక వర్గంలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ దఫా రాష్ట్రంలో అభ్యర్థుల ఎంపికలో సర్వేలకు ప్రాధాన్యమివ్వడం, సీనియర్లను కూడా పక్కన పెట్టడం, వంటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎస్ కోట టీడీపీ అభ్యర్థి ఎంపికపై కూడా రాజకీయ వర్గాల్లో అనేక విశ్లేషణలు వినిపించాయి.మొత్తంమీద కోళ్ల లలితకుమారివైపే ఆ పార్టీ అధిష్టానం మొగ్గుచూపడంతో ఊహాగానాలకు తెరపడింది. ఇక జిల్లా లో చీపురుపల్లి నియోజక వర్గం టిడిపి అభ్యర్థి తో పాటు విజయనగరం ఎంపి అభ్యర్థి ఎవరనేది తేలాల్సి వుంది.చీపురుపల్లిలో బొత్సకు ధీటుగా నిలిచి, విజయం సాధించే అభ్యర్థి ని ఎంపిక చేసే ప్రయత్నంలో టీడీపీ వుంది. 2019లో బొత్సపై పోటీ చేసిన కిమిడీ నాగార్జున ఈసారి కూడా టికెట్ ఆశిస్తున్నారు. అయితే టీడీపీ అధిష్టానం మాత్రం మాజి మంత్రి గంటా శ్రీనివాసరావు ను బరిలో దించాలని యోచిస్తోందనే ప్రచారమైతే సాగింది. టీడీపీ మూడవ విడత జాబితాలో కూడా చీపురుపల్లి అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో అధిష్టానం మనసులో ఏముందనేది తెలియక నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు అధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పార్టీ కష్టకాలంలో కూడా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకున్న నాగార్జున కే అవకాశం దక్కుతుందని ఆయన అభిమానులు భావిస్తున్నారు. చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి తో పాటు విజయనగరం ఎంపి అభ్యర్థిని కూడా ఎంపిక చేయలేదు. విజయనగరం ఎంపి అభ్యర్థి అనగానే టీడీపీ వర్గాల్లో మొదటిగా మాజి మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు పేరే మదిలో మెదులుతుంది. అయితే పెద్దాయన ఈ సారి ఎన్నికల బరిలో నిలిచేందుకు అంతగా ఆసక్తిచూపడం లేదనే మాట ప్రచారంలో వుంది. ఈ నేపథ్యంలోనే డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు పేరు తెరపైకి వచ్చిందని చెపుతున్నారు. మొత్తంమీద అటు చీపురుపల్లి, ఇటు విజయనగరం ఎంపి అభ్యర్థులుగా ఎవరుంటారనే అంశంపై జిల్లాలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.

వైసిపితోనే సామాజిక న్యాయం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వైసిపితోనే సామాజిక న్యాయం సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. నెల్లిమర్లలో వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావించి 13 వసంతాలు పూర్తయిన సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించి ఎన్నో సవాళ్లను అధిగమించి 2019లో అధికారం చేపట్టారని వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందిపరిచిన 99శాతం హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. సంక్షేపాలన కొనసాగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైసిపి నగరపంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, యవజన విభాగం నగరపంచాయతీ అధ్యక్షులు హరీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య అవసరతల కొరకే ఆరోగ్య సురక్ష

వృద్ధులకు మందులను అందచేస్తున్న వైద్యాధికారి డా.సామ్రాజ్య లక్ష్మి

విశాలాంధ్ర-జామి: ప్రజలకు మెరుగైన వైద్యం, ఆరోగ్య అవసరతల కొరకే, ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని జామి వైద్యాధికారి డా.ఆర్.సామ్రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వి.ఆర్.పాలెం గ్రామసచివాలయంలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరములో వైద్యనిపుణులు డా.సామ్రాజ్యలక్ష్మి,డా.కృష్ణ కుమారి, డా.ఐ.ఉదయ్‌కుమార్ పాల్గొని 186 మందిరోగులకు తనిఖీలను నిర్వహించారు. మెరుగైన వైద్యసహాయం కొరకు ఇద్దరిని రిఫర్ చేసామని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యాతీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి రోగులకు ఆరోగ్యవిద్య ద్వారా తెలియచేసారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది ఫ్లోరెన్స్, భవాని, ఎ.ఎన్.ఎమ్.లు, ఎమ్.ఎల్.హెచ్.పి.లు, ఆరోగ్య సహాయకులు, గ్రామసచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-తెర్లాం : పలు అంశాలపై మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు వారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ మండల ప్రాదేశిక సభ్యులు, మండల అధికారులు పాల్గొనడం జరిగింది.

అయ్యప్ప ఆలయ నిర్మాణమునకు రూ.50 వేలు వితరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లిలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నకు విశాఖపట్నం కు చెందిన ఇస్సరి నరసింగరావు లక్ష్మి దంపతలు,కొడుకు కోడలు సతీష్ కుమార్, స్పందన, కూతురు, అల్లుడు కోరాడ కనక మహాలక్ష్మి,, శివకుమార్ 50,001వేలు విరాళంగా ట్రస్టబోర్డు సభ్యులైన అప్పికొండ ఆదిబాబు, ఎస్‌విజి శ్రీనివాసరావు,గంట్యాడ విష్ణుమూర్తి, దాసరి రవిశంకర్ రాయల్ గురుస్వామి గుడ్ల శ్రీనివాస్ లకు అందచేసారు.

కోమటిపల్లిలో పౌష్టికాహార వారోత్సవాలకు విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం కోమటిపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జాగాన విజయలక్ష్మి ఆదేశాలతో అంగన్వాడి సూపర్వైజర్ ప్రభావతి, స్థానిక అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు రెడ్డి ఈశ్వరమ్మ, మడక అన్నపూర్ణమ్మ, వెలమల మంగమ్మ, పూడి భవాని లు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయా కేంద్రాల్లో చిన్నారులు తల్లులతో పౌష్టికాహార వారోత్సవాలు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి చిన్నారుల పల్లిలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు బాలింతలకు గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అవగాహనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం ప్రియాంక, మహిళా పోలీస్ ఎమ్మెన్ కేజీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు మహేష్ గుండుపోటుతో మృతి

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కెంగువ మహేష్(50) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, ఇరువురు కుమార్తెలు కలరు. ఇటీవల మహేష్ కు రామభద్రపురం వద్ద రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలైనవి. మహేష్ రెండో తమ్ముడు రామారావు విజయనగరం జిల్లా పద్మనాభం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం రెండో తమ్ముడు రామారావు కు దిన కర్మ చేశారు. దినకర్మ రోజున రామారావు అన్నయ్య హోంగార్డు మహేష్ అకాల మృతి చెందడంతో మృతుడు తండ్రి సన్యాసిరావు తీవ్రంగా రోదించాడు.

వ్యాసరచన పోటీ విజేతకు పదివేల బహుమతి అందించిన అదితి గజపతిరాజు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : జన జాగరణ సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ జీవిత చరిత్రపై ఉత్తరాంధ్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పట్టణంలో శ్రీ చైతన్య స్కూల్ 9వ తరగతి విద్యార్థిని జి.వెంకట సాయి లాస్య ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థినికి తెలుగుదేశం పార్టీ విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజు చేతుల మీదుగా 10వేల రూపాయల నగదు బహుమతితో పాటు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని తెలిపే పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ 23 సంవత్సరాల అతి చిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి తరం విద్యార్థులకు తెలిసే విధంగా జన జాగరణ సమితి వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మనదేశంలో భవిష్యత్ తరాలకు అందించ దానికి వెలకట్టలేని సంపద ఏదైనా ఉంది అంటే అది కేవలం స్వాతంత్ర్య సమరయోధుల వీరోచిత గాథలేనని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జన జాగరణ సమితి జిల్లా కన్వీనర్ కదారి శివ, రామకృష్ణ, శ్రీ చైతన్య స్కూల్ రీజనల్ ఇంచార్జి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శ్రీధర్, డీన్‌లు సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.